సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 18 । నవంబర్ । 2023



జీవన మనుగడకు ఆక్సిజన్

ఓటు.. వ్యక్తి జీవన మనుగడకు ఆక్సిజన్ లాంటిదని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ అన్నారు. - 10లో



కాడెద్దుల నుంచి హస్తానికి..

1952లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తు కాడెడ్లు. 1977 నుంచి హస్తం గుర్తుతో బరిలో నిలుస్తోంది. - 10లో



గంజాయి పట్టివేత

ఏపీ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 150 కిలోల గంజాయిని గూడూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. - 10లో

న్యూస్‌రీల్

జిల్లాకు యూపీ సీఎం?

సాక్షి యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ జిల్లాకు రానున్నారని తెలిసింది. భువనగిరి, ఆలేరు అభ్యర్థుల తరపున ప్రచారం చేయడానికి పార్టీ నాయకత్వం ప్లాన్ చేస్తోంది. యోగి పర్యటన ఖరారైనప్పటికీ ఏయే తేదీల్లో ఆయన పర్యటించేది పార్టీ రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తోంది.

ఆత్మకూరు(ఎం) మండల ఏఓగా సుజాత

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండల వ్యవసాయ ఇన్‌చార్జిగా అధికారికి మోటకొండూరు ఏఓ సుబ్బూరు సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆశాఖ జిల్లా అధికారి అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఏఓగా పని చేస్తున్న శిల్ప ఇటీవల కలెక్టరేట్‌లో యాదగిరిగుట్ట మండలానికి చెందిన ఏఈఓ మనోజ్‌పై కత్తితో దాడి చేసిన ఘటనలో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో మోటకొండూరు ఏఓను ఇన్‌చార్జిగా నియమించారు.

ఓటరు చైతన్యమే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

భువనగిరిటౌన్ : ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించడంతో పాటు ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా స్వీప్ విభాగంలో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాటల రూపంలో ప్రజలను చైతన్యం పరుస్తున్నారు. శుక్రవారం భువనగిరి బస్టాండ్, బ్యాంకు, పలు కాలనీల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఓటు వేయాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపాలటీల్లో వంద శాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా ఓటు ఆవశ్యతను వివరించడంతో పాటు ఓటు వేసేలా ప్రజల్లో చైతన్యం తెస్తున్నట్లు జిల్లా స్వీప్ నోడల్ అధికారి భట్టు నాగిరెడ్డి తెలిపారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం రమాదేవి, పీడీ కవిత

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు నందిగామ అక్షయ, ఎర్రోజు ఐశ్వర్య ఎంపికయ్యారు. ఇటీవల సూర్యాపేట జిల్లా నడిగూడెంలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి పోటీల్లో అండర్ -17 విభాగంలో నందిగామ అక్షయ, అండర్-14 విభాగంలో ఎర్రోజు ఐశ్వర్య ఉత్తమ ప్రదర్శ కనబరిచారని పాఠశాల హెచ్‌ఎం ఆర్.రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు వి.కవిత శుక్రవారం తెలిపారు. త్వరలో గద్వాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

భువనగిరి క్రైం : జిల్లా కేంద్రంలోని సితార, లక్ష్మి, ఎస్.వీ వైన్స్‌లలో శుక్రవారం ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాకేష్‌కుమార్ తనిఖీలు చేశారు. మద్యం విక్రయాలు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నిబంధన మేరకు అమ్మకాలు జరపాలని నిర్వాహకులకు సూచించారు. తనిఖీల్లో జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్, ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి, ఎస్ఐ సాయి కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

20న హాకీ, హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్: ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికల హాకీ, హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ఈనెల 20న నల్లగొండలోని అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వాసుదేవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9గంటలకు 10వ తరగతి మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, పూర్తి వివరాల కోసం సెల్ నంబర్ 9441463290 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

● భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నాగులచవితి సందర్భంగా శుక్రవారం భువనగిరిలోని పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

● కార్తీక దీపారాధన



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట : కార్తీకమాసాన్ని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం దీపారాధన నిర్వహించారు. భక్తులు ప్రమిదలు కొనుగోలు చేసి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు.నాగుల చవితి సందర్భంగా మొదటి ఘాట్ రోడ్డులో ఉన్న నాగదేవత పుట్ట వద్ద పూజలు చేశారు. అదే విధంగా ప్రధానాలయంలో ఊంజలి సేవోత్సవం కనులపండువగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సేవను ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అధిష్టించి ఊంజలి సేవోత్సవం చేపట్టారు. దీంతో పాటు ఆలయ ముఖ మండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శననారసింహ హోమం నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.

కదిలొస్తున్న బలగం

ప్రచారంలో సకుటుంబ సపరివారం

అభ్యర్థులకు తోడుగా.. నీడగా ఇంటిల్లిపాది

- తమ వారి గెలుపు కోసం చెమటోడుస్తున్న బంధుగణం
- గడపగడపకూ తిరుగుతూ ఓటర్లతో మమేకం
- అన్నీ తామై ముందునడుస్తున్న చుట్టాలు
- తెరముందు కొందరు.. తెరవెనుక మరికొందరు

అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా వారి తరపున కుటుంబ సభ్యులు, బంధువులు ప్రచారంలోకి దిగారు. కుమారులు, కూతుర్లు, కోడళ్లు, అల్లుళ్లు, అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లు.. ఇలా బంధుగణమంతా ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ కుటుంబ సభ్యుల ప్రచార జోరు పెరిగింది. ఎన్నికల ప్రచారం, పర్యవేక్షణతో పాటు ఆర్థిక వ్యవహారాలను కూడా చూసుకుంటున్నారు. అందరినీ సమన్వయం చేస్తూ తమవారి గెలుపు కోసం వ్యూహరచన చేస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, నల్లగొండ/సాక్షి, యాదాద్రి

◆ సూర్యాపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి జగదీష్‌రెడ్డి గెలుపు కోసం ఆయన తండ్రి, తనయుడు, సతీమణి ప్రచారం కొనసాగిస్తున్నారు. మంత్రి సతీమణి సునీత నెల రోజుల ముందు నుంచే సూర్యాపేట పట్టణంలో కలియ దిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆమెతోపాటు మంత్రి కుమారుడు వేమన్‌రెడ్డి, తండ్రి చంద్రారెడ్డి ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కోసం ఆయన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి ప్రచారంలో పాల్గొంటున్నారు. బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు కోసం ఆయన సతీమణి లక్ష్మి, కుమారులు సంకినేని అరుణ్, వరుణ్, కోడళ్లు అనూష, సుష్మ ప్రచారం చేస్తున్నారు. బీఎస్పీ అభ్యర్థి జానయ్య యాదవ్ కోసం ఆయన సతీమణి రేణుక ప్రచారం చేస్తున్నారు.

◆ తుంగతుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ గెలుపు కోసం ఆయన సతీమణి గాదరి కమల విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టు పెట్టి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య సతీమణి సరస్వతి ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు.

◆ కోదాడ నియోజకవర్గంలో సతి కోసం పతి ప్రచారం ఆకట్టుకుంటోంది. కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి గెలుపు కోసం ఆమె భర్త, ఎంపీ, హుజూర్‌నగర్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనూ ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు, ఆయన తరపున బంధువులు ప్రచారం కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ తరపున ఆయన సతీమణి ఇందిర, కూతురు కావ్య, కోడలు నవత ప్రచారం చేస్తున్నారు.

◆ హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి రజిత, సోదరుడు శేఖర్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి తరపున ఆమె సోదరుడు పోరెడ్డి కిషోర్ రెడ్డి, సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి తరపున ఆమె భర్త మల్లు నాగార్జునరెడ్డి ప్రచారం చేస్తున్నారు.



ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత తరపున ఆమె భర్త గొంగిడి మహేందర్‌రెడ్డి, అల్లుడు అక్షయ్‌రెడ్డి, కుమార్తె అంజనీరెడ్డి, హర్షిత రెడ్డి, తమ్ముడు వాసు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య తరపున ఆయన సతీమణి అనిత, కుమార్తెలు అరుంధతి, శృతి, సోదరుడు శంకర్ ప్రచారం చేస్తున్నారు.

◆ మిర్యాలగూడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు గెలుపు కోసం ఆయన సతీమణి జయ ముమ్మర ప్రచారం చేస్తున్నారు. మహిళలతో కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయన తనయుడు సిద్ధార్థ వివిధ వర్గాల ప్రజలతో మమేకం అవుతూ సభలు, సమావేశాల్లో పాల్గొంటున్నారు. అలాగే భాస్కర్‌రావు బంధుగణమంతా ప్రచారంలోకి దిగింది. సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి జూలకంటి సుజాత విస్తృతంగా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి బత్తుల మాధవి ప్రచారంలో పాల్గొంటున్నారు.

◆ దేవరకొండలో బీజేపీ అభ్యర్థి లాలునాయక్‌ను గెలిపించాలని కోరుతు ఆయన సతీమణి లక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రవీంద్ర కుమార్ కోసం ఆయన సతీమణి శ్యామల, కాంగ్రెస్ అభ్యర్థి బాలు నాయక్ తరపున ఆయన సతీమణి జ్యోతిప్రసన్న ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

వినూత్న రీతిలో..

కొందరు అభ్యర్థుల బంధువులు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు బొట్టు పెట్టి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. మిర్చీ బజ్జీలు, టీ చేస్తూ ఒకరు, పండ్లు అమ్ముతూ మరొకరు, పిల్లలను ఎత్తుకొని లాలిస్తూ, దుస్తులు ఇస్త్రీ చేస్తూ, మేస్త్రీ పనిచేస్తూ ఓట్లు అడుగుతున్నారు. ప్రచారం కోసం సామాజిక మాధ్యమాలను సైతం వినియోగించుకుంటున్నారు. ఇందులో తమ అభ్యర్థులు చేసిన, చేయబోయే అభివృద్ధి పనులను వివరిస్తూ పోస్టులు పెడుతున్నారు. హంగూ ఆర్భాటాలు లేకుండా సాదాసీదాగా వచ్చి ఓటు అడుగుతున్న తీరు వృద్ధులు, మహిళలు, యువకులను ఆకట్టుకుంటోంది.

కుమారులు, కూతుళ్లు, అల్లుళ్లు

భువనగిరిలో బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్ రెడ్డి తరపున ఆయన భార్య వనితారెడ్డి, కుమార్తె మాన్వితారెడ్డి, సోదరుడు భీమార్జున్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి ప్రచారం ముమ్మరం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తరపున భార్య కిరణ్‌జ్యోతిరెడ్డి, కుమారుడు శ్రీరామ్‌రెడ్డి, కుమార్తెలు కీర్తిరెడ్డి, స్ఫూర్తిరెడ్డి, అల్లుళ్లు శ్రీనివాస్‌రెడ్డి, అలోక్‌రెడ్డి, సోదరీమణులు విజయలక్ష్మి, ఝాన్సీ ప్రచారం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి తరపున కుమారుడు ప్రణయ్‌రెడ్డి, కోడలు డాక్టర్ స్రవంతి, సోదరులు గూడూరు నరోత్తంరెడ్డి, జైపాల్‌రెడ్డి, మరదలు రేణుక ప్రచారంలో ఉన్నారు.



ప్రచారంలో భాగంగా హోటల్‌లో పూరి కాలుస్తున్న తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్ సతీమణి కమల

◆ నాగార్జునసాగర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి నోముల భగత్ కోసం ఆయన తల్లి లక్ష్మి, సతీమణి నోముల భవాని ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి తరపున తండ్రి జానారెడ్డి ప్రచారం చేస్తున్నారు.

◆ నల్లగొండ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి గెలుపు కోసం ఆయన సతీమణి రమాదేవి ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తరపున ఆయన సతీమణి సబితతో పాటు కూతురు శ్రీనిధి కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ సతీమణి విజయలక్ష్మి ప్రచారం చేస్తున్నారు.

◆ మునుగోడులో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సతీమణి అరుణ, కుమార్తె రమ్య, కోడలు స్రవంతి, కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి, కుమారుడు సంకీర్త్‌రెడ్డి, కోడలు తరుణ్య, బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి తరపున ఆయన భార్య రజిత, సోదరుడు నర్సింహారెడ్డి, కుమారుడు వినయ్‌కుమార్ రెడ్డి, కోడలు లితిక ప్రచారం చేస్తున్నారు.

◆ నకిరేకల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య విజయం కోసం ఆయన కుమారుడు మనోజ్ ప్రచారం చేస్తున్నాడు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం గెలుపునకు ఆయన కుమారుడు విపుల్ ప్రచారం నిర్వహిస్తున్నాడు.

పట్టుబడిన సొత్తు రూ.2 కోట్ల పైనే..

- ఆలేరు చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం
- రూ.25.61 లక్షల విలువ చేసే మద్యం, 325.8 గ్రాముల బంగారం స్వాధీనం

యాదగిరిగుట్ట : ఎన్నికల్లో రాజకీయ పార్టీలు డబ్బు, మద్యం తరలించకుండా అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై ఆలేరుతో పాటు బొమ్మలరామారం, తుర్కపల్లి, రాజాపేట, ఆత్మకూరు(ఎం), గుండాల, యాదగిరిగుట్ట, మోటకొండూర్ మండలాల శివారులో చెక్‌పోస్టుల ఏర్పాటు చేశారు. మద్యం, డబ్బు తరలించే అవకాశం ఉన్న దృష్ట్యా చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, అధికారులు నిరంతర నిఘా పెట్టారు. ఎన్నికల షెడ్యూల్ ఏర్పడి తేదీ నుంచి శుక్రవారం వరకు ఆలేరు చెక్‌పోస్టు వద్ద రూ.2.89 కోట్ల నగదు, 325.8 గ్రాముల బంగారం పట్టుబడగా పోలీసులు వాటిని సీజ్ చేశారు. వీటితో పాటు రూ.25,61,867 విలువ చేసే 1571.259 లీటర్ల మద్యం, 1.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ శివరాం రెడ్డి వెల్లడించారు. జాతీయ రహదారిపై వెళ్లే ప్రతి వాహనాన్ని ఆలేరు చెక్‌పోస్టు వద్ద పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.



ఆలేరు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఏసీపీ శివరాంరెడ్డి, సీఐ సురేందర్‌రెడ్డి

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

రాజాపేట : ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే హెచ్చరించారు. శుక్రవారం రాజాపేట మండలంలోని రేణికుంటలో 102, 103 పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సౌకర్యాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఓటరు స్లిప్‌లతో పాటు ఓటరు గైడ్, సీ–విజిల్ యాప్‌పై అవగాహన కరపత్రాలను అందజేయాలని ఆదేశించారు. ఎవరైనా ఎన్నిక నియమావళి ఉల్లంఘిస్తే సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్ఞానప్రకాష్, వీఎల్‌ఓలు ఉన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట

- బీఆర్ఎస్ హయాంలోనే కులవృత్తులకు పూర్వవైభవం
- ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

యాదగిరిగుట్ట రూరల్ : ముదిరాజ్‌ల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత పేర్కొన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఆలేరు నియోజకవర్గ ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనానికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్, గొంగిడి సునీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి నుంచి కులవృత్తులను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా ముదిరాజ్‌లను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో చేపల పెంపకానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించడంతో నేడు ముదిరాజ్‌లు చెరువుల్లో చేపల పెంపకం చేపడుతూ జీవనోపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పరిధిలో ముదిరాజ్ భవనాన్ని నిర్మిస్తామని చెప్పారు. అదేవిధంగా యాదాద్రిలో ఏర్పాటు కానున్న పారిశ్రామిక వాడలో ముదిరాజ్‌లకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్రం, ఆలేరు నియోజకవర్గం అభివృద్ధిలో మరింత ముందుకెళ్లాలంటే మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేయాలని సునీత విజ్ఞప్తి చేశారు.



వంగపల్లిలో జరిగిన ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత, వేదికపై బండ ప్రకాశ్ తదితరులు

కేసీఆర్‌తోనే కులవృత్తులకు పూర్వవైభవం

ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే కులవృత్తులు పూర్వవైభవం సంతరించుకున్నాయని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగడానికి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని, చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లల పెంపకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది మంది ముదిరాజులకు ఉపాధి లభిస్తుందన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, మత్స్యశాఖ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్పుల హరినాథ్, మాజీ ఎంపీపీ పల్లెపాటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి గుండ్లపల్లి శ్రీను, విద్యావంతుల వేదిక చైర్మన్ చింతకాయల దినేష్, అల్లుడు జగన్ ముదిరాజ్, పాశం సంజయ్ బాబు, పల్లెపాటి బాలయ్య, శెట్టి శ్రీనివాస్, సత్యనారాయణ,చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిత్రాలు

● మీ ఓట్లన్నీ నాకే..



కోదాడ మండలం చిమిర్యాలలో యువకులతో సెల్ఫీ దిగుతున్న కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి

● ప్రచారంలో దూసుకుపోతాం..



బీఆర్ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావుకు మద్దతుగా వేములపల్లి మండలంలో ప్రచారం చేస్తున్న దివ్యాంగురాలు

జంగ్ తెలంగాణ

● మీ దీవెనలే.. శ్రీరామరక్ష



బీబీనగర్ మండలంలో వృద్ధురాలికి దండం పెట్టి ఓటు అడుగుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి

● చాయ్ పెట్టు.. ఓటు పట్టు



దామరచర్ల మండలంలో ప్రచారంలో భాగంగా చాయ్ చేస్తున్న సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి

బైండోవర్, బౌండ్ డౌన్ అంటే..



తిరుమలగిరి (తుంగతుర్తి) : ఎన్నికల సమయంలో సాధారణంగా పాత నేరస్తులను, రౌడీ షీటర్లను, బెల్టు దుకాణాలు నిర్వహించే వారితోపాటు శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, ఎవ్వరి చర్యలపైనైనా అనుమానం వచ్చినా అలాంటి వ్యక్తులను పోలీసులు స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరుస్తారు. చట్ట వ్యతిరేక పనులు చేయబోమని బాండ్‌పై లిఖిత పూర్వక హామీతో సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేస్తారు. ఈ ప్రక్రియను బైండోవర్ (బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్) సత్ప్రవర్తనకు హామీ అంటారు. బైండోవర్ సమయంలో బాండ్‌లో రాసిచ్చిన హామీని అతిక్రమించడాన్ని బౌండ్ డౌన్ అంటారు. వ్యక్తిగతంగా హాజరై రాత పూర్వకంగా ఇచ్చిన హామీని మితిమీరడమంటే చట్టాన్ని ఉల్లంఘించడమే. దీనిపై భారతీయ శిక్షాస్మృతి 107, 108, 109, 110 సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తారు. బైండోవర్ అయిన వ్యక్తి శిక్షను తప్పించుకునేందుకు పైకోర్టులను ఆశ్రయించవచ్చు. ఇదంతా బౌండ్ డౌన్ చేసిన వారి వివరాలతో పోలీసులు నివేదికను తయారు చేసినప్పుడే వీలవుతుంది.

బాండ్ పేపర్‌పై అభ్యర్థి హామీలు

చౌటుప్పల్ : మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని రాంనగర్‌కాలనీకి చెందిన చెరుకు శివకుమార్‌గౌడ్ ప్రజలకు బాండ్ పేపర్‌పై తన హామీలను రాసిచ్చి బహిరంగ ప్రకటన చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ కేంద్రంలో బాండ్ పేపర్‌ను విడుదల చేశారు. ఉన్నత విద్యావంతుడైన ఈ యువకుడు విద్యార్థి నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా స్థానికంగా సేవలందిస్తున్నాడు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి వినూత్న కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్తున్నాడు. ఎన్నికల్లో భాగంగా తాను ఇచ్చిన హామీలను గెలిచిన మూడేళ్లలోపు నెరవేర్చకపోతే తనపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు తన ఆస్తులను జప్తు చేసి నియోజకవర్గ ప్రజలకోసం వినియోగించాలని ప్రకటించారు. అభ్యర్థి బాండ్ పేపర్ హామీ ఇవ్వడం స్థానికంగా చర్చనీయాంశమయ్యింది.

ఓటు.. జీవన మనుగడకు ఆక్సిజన్



విద్యార్థినుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న సమాచార హక్కు పరిరక్షణ సమితి నాయకులు

నల్లగొండ రూరల్ : ఓటు వ్యక్తి జీవన మనుగడకు ఆక్సిజన్ లాంటిదని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. శుక్రవారం ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఓటరు అవగాహన ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య మనుగడ, సమర్థమైన పాలన, సంక్షేమం కోసం మంచి పాలకుడిని ఎన్నుకునే స్వేచ్ఛ ఓటు హక్కు ద్వారా రాజ్యాంగం కల్పించిందన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తే అందుకు సంబంధించిన ఆధారాలతో సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులంతా తమ ఓటును వినియోగించుకోవడంతో పాటు ఇంటి పక్కన ఉండే వారిని చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఘనశ్యాం, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, రాజారాం, శైలజ, సరిత, వనజ, స్వప్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖర్గేతో పటేల్ రమేష్‌రెడ్డి భేటీ



ఖర్గే , రేవంత్‌రెడ్డితో భేటీ అయిన పటేల్ రమేష్‌రెడ్డి

సూర్యాపేట : భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్కలతో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. సూర్యాపేట అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి ఉపసంహరించుకున్న పటేల్ రమేష్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు ఖర్గేతో పాటు సీనియర్ నాయకుల బృందం అభినందించినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు. ఎంపీలు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎల్పీ నేత భట్టి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామోదర్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రమేష్‌రెడ్డికి భరోసాగా నిలుస్తామని ఖర్గే హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధిష్టానం సూచనల మేరకు క్రమశిక్షణ గల సైనికుడిగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషిచేస్తానని రమేష్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్సీ..



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మాజీ ఎమ్మెల్సీ భారతీ రాగ్యానాయక్, కుమారుడు స్కైలాబ్‌నాయక్, ఎంపీపీ నందిని తదితరులు

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలినట్లయ్యింది. ఆ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు నల్లగొండ జిల్లాలో గిరిజనుల్లో పట్టున్న నేతలైన మాజీ ఎమ్మెల్సీ ధీరావత్ భారతీ రాగ్యానాయక్, ధీరావత్ స్కైలాబ్‌నాయక్‌తోపాటు దామరచర్ల ఎంపీపీ నందినిరవితేజ, దామరచర్ల మండలానికి చెందిన బండావత్‌తండా సర్పంచ్‌తోపాటు మరో ఐదుగురు మాజీ సర్పంచ్‌లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. వారంతా శుక్రవారం హైదరాబాద్‌లోని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో వీరి చేరికతో మిర్యాలగూడతోపాటు నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో ప్రభావం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ మిర్యాలగూడ అభ్యర్థి బత్తుల లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు చిరుమర్రి కృష్ణయ్య, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అభ్యర్థుల సమాచారం తెలుసుకోవచ్చు


తిరుమలగిరి (తుంగతుర్తి) : ఓటేసి గెలిపించే ప్రజాప్రతినిధుల ఆస్తులు, అప్పులు, నేర చరిత్ర, విద్య, వ్యాపారాలు, చదువు తదితర అంశాలు ప్రజలకు తెలియాల్సిందే. అందులో భాగంగా నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న సమయంలోనే అభ్యర్థులు తమ పూర్తి సమాచారాన్ని అఫిడవిట్ రూపంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారు. వాటిని రిటర్నింగ్ అధికారులు భారత ప్రధాన ఎన్నికల సంఘానికి పంపిస్తారు. వాటిని అందరికీ తెలిసేలా ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉంచుతారు. అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకుంటున్న కార్యాలయంలో నోటీస్ బోర్డుపై సైతం పెడతారు. వాటిని ఎవరైనా పరిశీలించుకోవచ్చు. పొందు పరిచిన సమాచారం తప్పుగా ఉన్నట్లు తెలిస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లవచ్చు. ఫిర్యాదులను ఆర్ఓ ఎన్నికల సంఘానికి పంపిస్తారు.



నోటీస్ బోర్డుపై అభ్యర్థుల అఫిడవిట్లు

కాడెడ్ల నుంచి హస్తానికి..

తిరుమలగిరి (తుంగతుర్తి) : దేశంలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే రాజకీయ పార్టీల గుర్తుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. 1952లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గుర్తు కాడెడ్లు. ఈ గుర్తుతోనే దేశమంతా ఎన్నికల బరిలో నిలిచింది. ఆ తరువాత ఆ పార్టీ చీలి కాంగ్రెస్ (ఇందిర) ఏర్పాటు కావడంతో దీనికి ఆవు దూడ గుర్తును కేటాయించారు. ఇదే గుర్తుతో 1971 ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ తరువాత చీలిపోయిన కాంగ్రెస్ తిరిగి విలీనమై భారత జాతీయ కాంగ్రెస్ పేరుతో ఏర్పడడంతో దీనికి హస్తం గుర్తును కేటాయించారు. 1977 నుంచి హస్తం గుర్తుతో కాంగ్రెస్ ఎన్నికల బరిలో నిలుస్తోంది.



పీడీఎఫ్‌కు మొదట హస్తం..

1952 సార్వత్రిక ఎన్నికల సమయంలో కమ్యూనిస్టు పార్టీపై నిర్బంధం ఉండటంతో పీడీఎఫ్ పేరుతో బరిలో నిలువగా వీరికి స్వతంత్ర్య అభ్యర్థులకు కేటాయించే హస్తం గుర్తును కేటాయించారు. ఆ తరువాత సీపీఐకి కంకి కొడవలి, సీపీఎంకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తులను కేటాయించడంతో ఇవే గుర్తులతో ఆయా పార్టీలు ప్రతి సారి ఎన్నికల బరిలో నిలుస్తున్నాయి.

నేడు మిర్యాలగూడలో విజయ రాఘవన్ పర్యటన



మాజీ ఎంపీ విజయ రాఘవన్

మిర్యాలగూడ : సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎంపీ విజయ రాఘవన్ శనివారం మిర్యాలగూడలో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి గెలుపు కోరుతూ పట్టణంతోపాటు మండలంలో కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగించనున్నారు. ఉదయం 8 గంటలకు పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్వహించే సభలో మాట్లాడుతారని, తర్వాత మిర్యాలగూడ మండలంలోని గూడూరు, లక్ష్మీపురం, రుద్రారం గ్రామాల్లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొనున్నారు. ఈ కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు, అభిమానులు అన్ని ప్రజలు భారీగా హాజరు కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ కోరారు.

● అదనపు బ్యాలెట్ యూనిట్లు వచ్చాయ్..



ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య పెరగడంతో అదనపు బ్యాలెట్ యూనిట్లు అవసరం పడుతున్నాయి. శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని గోదాముకు ఈసీఐఎల్ నుంచి 570 అదనపు బ్యాలెట్ యూనిట్లు వచ్చాయి.
– దురాజ్‌పల్లి (సూర్యాపేట)

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం



సురేష్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: ఉరేసుకుని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామానికి చెందిన బానావత్ సురేష్ (23) 15ఏళ్లుగా పట్టణంలోని శాంతినగర్‌లోని మహాలక్ష్మి కిరాణ దుకాణంలో పనిచేస్తూ తన సోదరుడితో కలిసి వినోభానగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. కిరాణ దుకాణం యజమాని భార్య అనారోగ్యం బారిన పడడంతో పది రోజుల క్రితం వారి కుటుంబ సభ్యులంతా హైదరాబాద్‌కు వెళ్లారు. అప్పటి నుంచి దుకాణ నిర్వహణ పూర్తి బాధ్యతలు సురేష్ చూసుకుంటున్నాడు. అయితే, కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతున్న సురేష్ శుక్రవారం విధులకు వెళ్లి దుకాణంలోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత స్థానికులు గుర్తించగా అప్పటికే సురేష్ మృతిచెంది ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వ్యక్తి గత కారణాలతోనే సురేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి లింగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ కృష్ణయ్య పేర్కొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ అర్బన్:రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణం ముత్తిరెడ్డికుంటకు చెందిన ఎస్‌కె.రవూఫ్(30) మద్యానికి బానిసగా మారి కొంతకాలంగా ఏ పని చేయడం లేదు. దీంతో రవూఫ్ కుటుంబ సభ్యులు అతడిని పట్టించుకోవడం మానేశారు. ఉదయం 11: 02 సమయంలో రవూఫ్ మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌కు వచ్చి నెమ్మదిగా వస్తున్న ఫలక్‌నూమా రైలుకు ఎదురెళ్లాడు. గుర్తించిన డ్రైవర్ సడెన్ బ్రేక్ వేసి రైలును నిలిపాడు. అప్పటికే రైలు కిందపడిన రవూఫ్ తలకు తీవ్ర గాయం కావడంతో బయటికి తీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడినుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. మద్యం మత్తులోనే రవూఫ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. ఈ ఘటనతో రైలు 15 నిమిషాల పాటు నిలిచిపోయింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

జెండాను అవమానించిన వ్యక్తిపై కేసు

నూతనకల్: బీఆర్ఎస్‌పార్టీ జెండాను అవమానించిన వ్యక్తిపై శుక్రవారం నూతన్‌కల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నూతన్‌కల్ మండల పరిధి బిక్కుమల్ల గ్రామానికి చెందిన కుక్కల గణేశ్ ఈ నెల 16న బీఆర్ఎస్ పార్టీ జెండాను కిందపడేసి కాళ్లతో తొక్కి అవమానించాడు. దీంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గణేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య

పెద్దఅడిశర్లపల్లి : అదృశ్యమైన వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు.ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పీఏపల్లి మండలంలోని పిల్లిగుంటతండాకు చెందిన ఇస్లావత్ వెంకన్న(55)వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 8న కుటుంబ మనస్పర్థలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంకన్న కనబడటం లేదని ఈ నెల 13న గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వెతుకుతున్న కుటుంబ సభ్యులకు శుక్రవారం తమ పొలం వద్దకు వెళ్లగా అక్కడ దుర్వాసన రావడంతో వెళ్లి చూడగా వెంకన్న విగతజీవిగా పడి ఉన్నాడు. కుటుంబ కలహాలతోనే వెంకన్న ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన భుగత అనిల్ (22) కుటుంబం 15ఏళ్ల క్రితం హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ అంబేద్కర్‌నగర్‌లో స్థిరపడింది. అనిల్ హైదరాబాద్‌లోనే ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. డిప్లమా సరిఫికెట్లు తెచ్చుకునేందుకు అనిల్ శుక్రవారం ఉదయం తన బైక్‌పై ఒంగోలుకు బయలుదేరాడు. మార్గమధ్యలో నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో మహారాష్ట్ర నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా అనిల్ బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో అనిల్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి లారీడ్రైవర్ రిజ్వాన్‌ఖాన్ నిర్లక్ష్యపు డ్రైవింగే కారణమని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి జగన్నాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ ఎన్.ధర్మా తెలిపారు.

150కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయి ప్యాకెట్లను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

- కారులో తరలిస్తుండగా గూడూరు టోల్‌ప్లాజా వద్ద స్వాధీనం
- కారు డ్రైవర్ అరెస్ట్, మరో ఇద్దరి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి క్రైం, బీబీనగర్: ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్రకు రవాణా అవుతున్న 150 కిలోల గంజాయిని యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలోని రాజోలుకు చెందిన రఘువీర్‌రాయ్ కొంతకాలంగా మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని సరఫరా చేస్తున్నాడు. అందుకు నిజామాబాద్ జిల్లాలోని మన్నెపల్లికి చెందిన కారు డ్రైవర్ మహ్మద్ మహబూబ్‌ను పరిచయం చేసుకున్నాడు. రాజోలు నుంచి మహారాష్ట్రలోని దులియా పట్టణంలోని సాగర్‌కు సరుకు అప్పగించాలని, అందుకు ఒక్కో ట్రిప్‌కు రూ.25వేలు ఇస్తానని మహబూబ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. దీంతో మహబూబ్ ఇప్పటి వరకు నాలుగు సార్లు మహారాష్ట్రకు గంజాయిని తరలించాడు. మరోసారి గంజాయిని రాజోలు నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా ఉదయం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి 150 కిలోల గంజాయితో పాటు కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని తహసీల్దార్ ఎదుట పంచనామా చేసి కేసు నమోదు చేశామని, మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు డీసీపీ రవికుమార్, భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి, భువనగిరి రూరల్ సీఐ సత్యానారాయణ, ఎస్ఐ సంతోష్ కుమార్, బీబీనగర్ ఎస్ఐ యుగంధర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సు కిందపడి గాయపడిన విద్యార్థిని మృతి

భువనగిరిక్రైం : ప్రమాదవశాత్తు బస్సు కిందపడి గాయపడిన పీజీ విద్యార్థిని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. నేరేడుచర్ల మండలం దిర్శిన్‌చర్ల గ్రామానికి చెందిన దోరేపల్లి మాధురి సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ప్రభుత్వ పీజీ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతోంది. మాధురి ఈ నెల 14వ తేదీన తండ్రి వెంకటేశ్వర్లుతో కలిసి కళాశాల నుంచి స్వగ్రామానికి బయలుదేరింది. మార్గమధ్యలో భువనగిరి బస్టాండులో నల్లగొండ బస్సు ఎక్కింది. ఈ క్రమంలో తండ్రి వ్యక్తి గత పని నిమిత్తం బస్సు దిగాడు. ఇంతలోనే బస్సు వెళ్తుండగా తండ్రి లేడని గమనించిన మాధురి కదులుతున్న బస్సునుంచి ఒక్కసారిగా దిగడంతో అదుపుతప్పి వెనుక చక్రం కింద పడడంతో తీవ్రంగా గాయపడింది. మాధురిని తొలుత భువనగిరి ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి ఎస్ఐ సుధీర్ కృష్ణ తెలిపారు.